
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :
కొత్తగూడ గార్ల / కురవి దంతాలపల్లి పెద్దవంగర
గంగారం బయ్యారం చిన్నగూడూరు నెల్లికుదురు
కేసముద్రం మరిపెడ నర్సింహులపేట ఇనుగుర్తి

PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 27, ఫిబ్రవరి 2026 | సంపుటి :01 | సంచిక :7 | పేజీలు :4


2

మానుకోట కలెక్టర్ గా

## స్నేహ శబరీష్



2

మావోయిస్టుల

## భారీ డంప్ స్వాధీనం


3

రిజర్వాయర్ లోకి

## దూసుకెళ్లిన కారు

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- స్టేషన్ ఘన్ పూర్ రిజర్వాయర్ లో ఘటన
- దేశాయి తండాలో విషాదం

— వివరాలు 2వ పేజీలో..


2

అన్నదాతలకు

# 'ఈ-నామ్' గండం

- సాంకేతిక లోపాలతో నిలిచిపోతున్న కొనుగోళ్ల ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- సర్వర్ డౌన్ సమస్యతో రైతులకు తలనొప్పి
- మార్కెట్ కు సరుకు తీసుకువచ్చి పడిగాపులు
- చాలా మార్కెట్లలో మాన్యువల్ కు తిరుగు ప్రయాణం

వ్యవసాయ మార్కెట్లను దేశవ్యాప్తంగా ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కె ట్) పథకం అమలులో పలు ప్రాంతాల్లో తీవ్రమైన అంతరాయాలు ఎదురవుతున్నాయి. రైతులకు పారదర్శక ధరలు, వేగవంతమైన చెల్లింపులు, మధ్యవర్తుల పాత్ర తగ్గింపు వంటి లక్ష్యాలతో ప్రారంభమైన ఈ వ్యవస్థ సాంకేతిక లోపాల కారణంగా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా మార్కెట్ యార్డుల్లో సర్వర్ డౌన్ అవడం, లాగిన్ సమస్యలు, ఓటీపీ రాకపోవడం, నెట్ వర్క్ అంతరాయాలు వంటి కారణాలతో ఆన్ లైన్ వేలం ప్రక్రియ నిలిచిపోతున్నది. ముఖ్యంగా మిర్చి, పత్తి, ధాన్యం వంటి ప్రధాన పంటల కొనుగోళ్ల సమయంలో వ్యవస్థ పనిచేయకపోవడం వల్ల రైతులు గంటల తరబడి మార్కెట్ యార్డుల్లో వేచి చూడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల పరిస్థితి అదుపులో లేక మాన్యువల్ వేలం విధానాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది.

— ప్రభాత గమనం, మహబూబాబాద్

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక



# అన్నదాతలకు 'ఈ-నామ్' గండం

- సాంకేతిక లోపాలతో నిలిచిపోతున్న కొనుగోళ్ల ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- సర్వర్ డౌన్ సమస్యతో రైతులకు తలనొప్పి
- మార్కెట్ కు సరుకు తీసుకువచ్చి పడిగాపులు
- చాలా మార్కెట్లలో మాన్యువల్ కు తిరుగు ప్రయాణం

**ప్రభాత గమనం, మహబూబాబాద్:**

వ్యవసాయ మార్కెట్లను దేశవ్యాప్తంగా ఒకే వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) పథకం అమలులో పలు ప్రాంతాల్లో తీవ్రమైన అంతరాయాలు ఎదురవుతున్నాయి. రైతులకు పారదర్శక ధరలు, వేగవంతమైన చెల్లింపులు, మధ్యవర్తుల పాత్ర తగ్గింపు వంటి లక్ష్యాలతో ప్రారంభమైన ఈ వ్యవస్థ సాంకేతిక లోపాల కారణంగా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### అన్నదాతల పడిగాపులు

చాలా మార్కెట్ యార్డుల్లో సర్వర్ డౌన్ అవడం, లాగిన్ సమస్యలు, ఓటీపీ రాకపోవడం, నెట్‌వర్క్ అంతరాయాలు వంటి కారణాలతో ఆన్‌లైన్ వేలం ప్రక్రియ నిలిచిపోతున్నది. ముఖ్యంగా మిర్చి, పత్తి, ధాన్యం వంటి ప్రధాన పంటల కొనుగోళ్ల సమయంలో వ్యవస్థ పనిచేయకపోవడం వల్ల రైతులు గంటల తరబడి మార్కెట్ యార్డుల్లో వేచి చూడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల పరిస్థితి అదుపులో లేక మాన్యువల్ వేలం విధానాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది.

### మార్కెట్ సిబ్బందికి శిక్షణ అవసరం

ఈ-నామ్ ద్వారా బిడ్డింగ్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరగాల్సి ఉండగా, సాంకేతిక సమస్యలతో అది నిలిచిపోవడంతో ధరల నిర్ణయం ఆలస్యమవుతోంది. చెల్లింపులు కూడా వాయిదా పడుతున్నాయి. రైతులు అప్పుల బారిన పడిన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఈ విధమైన ఆలస్యం వారి ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తోంది. వ్యాపారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, లైసెన్సింగ్, చెల్లింపుల ప్రక్రియలో సాంకేతిక లోపాలు ఉండటంతో లావాదేవీలు పూర్తిచేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్కెట్ సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడం, సాంకేతిక మద్దతు సకాలంలో అందకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి.

### ప్రత్యామ్నాయం సిద్ధంగా ఉండాలి

డిజిటల్ వ్యవస్థ రైతులకు మేలు చేయాలంటే ముందుగా బలమైన సాంకేతిక వసతులు, నిరంతర సర్వర్ మద్దతు, మార్కెట్ స్థాయిలో సిబ్బందికి శిక్షణ అవసరం. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ విధానం కూడా సిద్ధంగా ఉండాలి. లేకపోతే 'డిజిటల్ మార్కెట్' అనే భావన కాగితాలకే పరిమితమైపోయే ప్రమాదం ఉంది. డిజిటల్ వ్యవస్థ రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ-నామ్ లోపాల కారణంగా విఫలమవుతుండటంపై రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, మార్కెట్లలో నిరంతర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పారదర్శకత, వేగం, నమ్మకం అనే మూడు లక్ష్యాలతో ప్రారంభమైన ఈ-నామ్ వ్యవస్థ రైతుకు నిజమైన మద్దతుగా నిలవాలంటే సాంకేతిక వైఫల్యాలను వెంటనే అధిగమించడం అత్యవసరం. లేకపోతే ఈ-నామ్ లక్ష్యం నెరవేరక, రైతులకే భారమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## మానుకోట జిల్లా కలెక్టర్ గా స్నేహ శబరీష్ బాధ్యతలు

మహబూబాబాద్ ఫిబ్రవరి 26(ప్రభాత గమనం): మానుకోట జిల్లా నూతన కలెక్టర్ గా స్నేహ శబరీష్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం సాయంత్రం గెస్ట్ హౌస్ కు చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ కు అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్, ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్ నూతన కలెక్టర్ కు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ గా స్నేహ శబరిష్ బాధ్యతలు స్వీకరించారు.

## మున్సిపల్ చైర్మన్ కు రవినాయక్ శుభాకాంక్షలు

కేసముద్రం ఫిబ్రవరి 26(ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ లుగా బాధ్యతలు స్వీకరించిన బానోత్ సునీతకు, అల్లం రమలకు నారాయణపురం గ్రామ మాజీ ఎంపీటీసి ధరావత్ నాయక్ గురువారం నాడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. కేసముద్రం పట్టణాన్ని రోల్ మోడల్ గా తిర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

**ప్రభాతగమనం, రాయ్ పూర్ :**

దేశంలోనే అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బస్తర్ డివిజన్‌లో నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలు వేగవంతమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మావోయిస్టు ప్రభావిత ఏడు జిల్లాల జాబితాలో బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్, సుక్మా, దంతేవాడ, కాంకేర్, నారాయణపూర్ జిల్లాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో




నక్సల్స్ నిర్మూలనే లక్ష్యంగా భద్రతా బలగాలు "ఆపరేషన్ క్లీన్ బస్తర్" పేరిట ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా గురువారం నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలకు పెద్ద విజయం లభించింది. జిల్లాలోని కుమురాడి కొండల్లో ఉన్న నక్సల్స్ స్థావరాన్ని బలగాలు గుర్తించి, అక్కడ దాచి ఉంచిన భారీ డంపును స్వాధీనం చేసుకున్నాయి. ఈ డంప్ నుంచి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను మరియు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) 53వ బెటాలియన్, సీఓబీ మండోరా బలగాలు సంయుక్తంగా ఏరియా డామినేషన్ కోసం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ భారీ డంప్ బయటపడింది. ఈ ఆపరేషన్ వల్ల మావోయిస్టుల వ్యూహాలకు పెద్ద దెబ్బ తగిలినట్లయింది.

# నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- వాహనం నడిపేటప్పుడు సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరి
- రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- రోడ్డు భద్రతపై వాహనదారులకు సీఐ వేణు అవగాహన

**వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం | ఫిబ్రవరి 26:**

స్టేషన్ ఘన్‌పూర్ లో 'అరైవ్, అలైవ్' పేరుతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ జి. వేణు ఆధ్వర్యంలో ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక చైతన్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ వేణు మాట్లాడుతూ, "ప్రయాణానికి ముందు ఒక్కసారి మీ కుటుంబం గురించి ఆలోచించండి. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది. ఒక్క నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని రోడ్డుపాలు చేస్తుంది. శిక్షలు విధించడం మాత్రమే మా లక్ష్యం కాదు... ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే మా ధ్యేయం" అని స్పష్టం చేశారు. వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలు క్షణాల్లో జీవితాలను మార్చేస్తాయని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడకం ప్రాణాపాయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీట్‌బెల్ట్ ధరించి వాహనం నడిపిస్తున్న డ్రైవర్లను గుర్తించి వారికి రోజా పువ్వులు అందించి అభినందించారు. రోడ్డు ప్రమాదాలలో ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యానికి చేరుకోవడమే రాష్ట్ర పోలీస్ శాఖ 'అరైవ్, అలైవ్' కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు అభినందించారు.




## మున్సిపల్ చైర్ పర్సన్ గా సునీత బాధ్యతల స్వీకరణ



కేసముద్రం ఫిబ్రవరి 26(ప్రభాత గమనం): కేసముద్రం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే మురళి నాయక్ సమక్షంలో చైర్ పర్సన్ బానోత్ సునీత గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరుపున రావాల్సిన నిధులు కేసముద్రం మున్సిపాలిటీ కోసం వచ్చేలా కృషి చేస్తామని తద్వారా భవిష్యత్తులో కేసముద్రం మున్సిపాలిటీ ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు. చైర్ పర్సన్ బానోత్ సునీత మాట్లాడుతూ.. రాజకీయాలతో సంబంధం లేకుండా కేసముద్రం మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



## కౌన్సిలర్ వల్లందాసు ఉమా రవికి సన్మానం

కేసముద్రం ఫిబ్రవరి 26(ప్రభాత గమనం): ఇటీవలే మున్సిపాలిటీ పదహారవవార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన వల్లందాసు ఉమా రవిని వీహెచ్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెపాక శంకర్ గురువారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఉమా రవికి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో వీహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు చింతల రాములు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్ లోకి దూసుకెళ్లిన కారు

- స్టేషన్ ఘన్ పూర్ లో ఘోర ప్రమాదం
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



వరంగల్ బ్యూరో / స్టేషన్ ఘన్‌పూర్(ప్రభాత గమనం): స్టేషన్ ఘన్‌పూర్ లో గురువారం విషాదం చోటు చేసుకుంది. స్టేషన్ ఘన్‌పూర్ నుండి చిలుపూర్ మండలం దేశాయి తండా వైపు వెళ్తున్న షిఫ్ట్ కారు అదుపుతప్పి సమీప రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచారం ప్రకారం కారు పల్టీలు కొట్టుకుంటూ రిజర్వాయర్‌లో పడినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో కారు అద్దాలు పగలడంతో ధారావత్ చరణ్ (18) తీవ్రంగా గాయపడ్డాడు. అతను కారు నుంచి బయటపడినా గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం. వెంటనే స్థానికులు అతన్ని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే కారు నడుపుతున్న భూక్యా పవన్ ఆచూకీ తొలుత తెలియకపోవడంతో సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టి, భూక్యా పవన్ మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై విచారణ జరపాలి

- కాంగ్రెస్ నాయకుడి చేతుల్లో ప్రొసీడింగ్ కాపీలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత కన్నం యుగేందర్ డిమాండ్



వరంగల్ బ్యూరో / భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 26: భూపాలపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వివాదానికి దారి తీసింది. వార్డు కౌన్సిలర్, బీజేపీ నాయకుడు కన్నం యుగేందర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు ముంజాల రవీందర్‌పై ఆరోపణలు చేశారు. తమ వార్డులో 11 మందికి ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అయితే ప్రొసీడింగ్ కాపీలను కాంగ్రెస్ నాయకుడు తన వద్ద ఉంచుకుని "మేమే ఇస్తున్నాం" అంటూ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 20న ఐదుగురికి మాత్రమే కాపీలు ఇచ్చి, మిగతా ఆరుగురికి ఇవ్వలేదన్నారు. ఓటు వేయలేదనే కారణంతో ఆపేశారని విమర్శించారు. ఒకే కుటుంబంలో భార్యకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, తల్లికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరికీ ఇళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు విచారణ జరిపి నిజానిజాలు వెలికి తీయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి వట్టెం తిరుపతి, అర్బన్ జనరల్ సెక్రటరీ కర్వేద మనోహర్ రెడ్డి, యువమోర్చా రాష్ట్ర నాయకులు ఓరుగంటి భగవాన్, మీడియా సెల్ కార్యదర్శి మునీందర్, నాయకులు వినయ్, జోడు కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వరంగల్ కోర్టుకు బాంబు బెదిరింపు

- రంగంలోకి బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు
- కోర్టు ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం:
వరంగల్ నగరంలోని కోర్టుకు బాంబు బెదిరింపు సందేశం స్థానికులను, పోలీసులను ఆందోళనకు గురి చేసింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై కోర్టు ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా చర్యలను చేపట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని కోర్టు భవనంలోని ప్రతి గది, మూలమూలలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏమైనా అనుమానాస్పద వస్తువులు ఉన్నాయా అనే దానిపై సమగ్రంగా పరిశీలించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా కోర్టు పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కోర్టుకు వచ్చిన న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బెదిరింపు సందేశం ఎక్కడి నుంచి వచ్చింది? దీని వెనుక ఎవరు ఉన్నారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి.



## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో కొట్లాడండి

- కౌన్సిలర్లకు మాజీ ఎంపీ మాలోత్ కవిత దిశానిర్దేశం
- మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందంటూ ధీమా

మహబూబాబాద్ ఫిబ్రవరి 26(ప్రభాత గమనం):
ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన మీరంతా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంతో కొట్లాడి అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా కృషి చేయాలని, నిరంతరం ప్రజాపక్షం వహించాలని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను గురువారం ఆమె అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మున్సిపాలిటీ పీఠం దక్కలేదని అధైర్య పడవద్దని.. ప్రజలంతా మన వెంటే ఉన్నారని తెలిపారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గద్దెదించడం ఖాయమని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేయాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

శుక్రవారం
27.02.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ముల్లకంపల్లో ఎస్సారెస్పీ కాల్వలు

- సాగునీరు రాక రైతుల ఆవేదన
- నర్సంపేట డివిజన్ లో ఎడారిలా మారిన కాలువలు
- నిర్వహణలో నిర్లక్ష్యం ఎవరిది?
- ప్రభుత్వం స్పందించి కాలువలను పునరుద్ధరించాలి

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం | ఫిబ్రవరి 26: నర్సంపేట డివిజన్ పరిధిలో కోట్ల రూపాయల వ్యయంతో తవ్విన సాగు కాలువలు ప్రస్తుతం పూడిక, చెత్త, చెట్లతో నిండిపోయి నిరుపయోగంగా మారాయి. కాలువలు నిర్మించి సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గ్రామాల పరిధిలోని ప్రధాన, ఉప కాలువల్లో చెట్లు పెరిగిపోవడంతో పాటు మట్టి పేరుకుపోయి అసలు ఆకారమే కనిపించని పరిస్థి తి ఉంది. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కొన్ని చోట్ల కాలువలు చెత్తకుప్పలుగా మారాయి. ఈ కాలు వలు ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) పరిధిలో భాగంగా తవ్వినవే. నర్సంపేట ప్రాంతానికి సాగునీరు అందించాలన్నదే లక్ష్యం. కానీ నిర్మాణానికే పరిమితమై నీటి సరఫరా మాత్రం ప్రారంభం కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిర్వహణలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం

కాలువల నిర్వహణ బాధ్యత నీటి పారుదల శాఖదే అయినప్పటికీ, పూడికతీత, చెట్ల తొలగింపు, మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. “కాలువలు తవ్వినప్పుడు మా పొలాలకు నీళ్లు వస్తాయని ఆశపడ్డాం. కానీ ఒక్క చుక్క నీరు కూడా రాలేదు. ఇప్పుడు కాలువలు అడవిలా మారిపోయాయి” అని రైతులు వాపోతున్నారు. ఈ కాలువలు సక్రమంగా పనిచేస్తే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రస్తుతం బోర్లపై ఆధారపడటంతో ఖర్చులు పెరిగి రైతులు అప్పులబారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువల్లో పూడికతీత చేపట్టాలని, చెట్లు, చెత్త తొలగించాలని, వెంటనే నీటి సరఫరా ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన కాలువలను పునరుద్ధరించి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



## మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయాలి

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం, ఫిబ్రవరి 26: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 7న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహా విజ్ఞాపన సభను విజయవంతం చేయాలని 2003 డీఎస్సీ ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర శాఖ పిలుపునిచ్చింది. ఈ మేరకు భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ పోతర్ల సతీష్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా న్యాయమైన పాత పెన్షన్ విధానం కోసం పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు సానుకూల నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయవచ్చని స్పష్టత ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ఇటీవల హైకోర్టు కూడా పాత పెన్షన్ కల్పించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలులో జాప్యం జరుగుతోందన్నారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పాత పెన్షన్ సాధించేందుకు కృషి చేయాలని కోరారు. మార్చి 7న నిర్వహించే మహా విజ్ఞాపన సభకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో సహా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాధ్యులు నాగరాజు, విజయబాబు, రాజేందర్, సంపత్, శర్మిల తదితరులు పాల్గొన్నారు.



## పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వరంగల్ బ్యూరో ప్రభాత గమనం /పరకాల, ఫిబ్రవరి 26: పరకాల మండలం నాగారం గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం నాగారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఇట్టబోయిన సమ్మయ్య 10వ వర్ధంతి సందర్భంగా పరీక్ష ప్యాడ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇట్టబోయిన ప్రమోద్, సాయివర్షిత్, సాకేత్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అజ్మీరా ట్రెండ్స్ షాప్ ప్రారంభం

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చౌరస్తా స్టేషన్ రోడ్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన అజ్మీరా ట్రెండ్స్ డ్రెస్సెస్ షాప్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గురువారం ప్రారంభించారు. వైట్ల క్రాంతి కుమార్, తాటిపాముల శివరామకృష్ణ, తాటిపాముల భిక్షపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షాపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రబెల్లి ప్రదీప్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌరస్తా ప్రాంతంలో ఆధునిక వసతులతో డ్రెస్సెస్ షాప్ ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారాభివృద్ధికి



ఇలాంటి నూతన దుకాణాలు దోహదపడతాయని అన్నారు.

## మోడల్ స్కూల్లో బోరు మోటార్‌కు మరమ్మత్తు

కేసముద్రం ఫిబ్రవరి 26(ప్రభాత గమనం) : కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ లో బోరు మోటార్ మరమ్మతుకు గురై విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వేల్పుల సుజాత రాంచంద్రయ్య లు వెంటనే స్పందించి గురువారం మోటర్ ను రిపేర్ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



మోడల్ స్కూల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలతో మహిళలకు
# ఆర్థిక స్వావలంబన

- కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ ద్వారా ఉపాధి అవకాశాలు
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- 50 మందికి కుట్టు మిషన్లు పంపిణీ

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం | ఫిబ్రవరి 26, 2026: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. గురువారం జాన్‌పాకలోని గోల్డెన్ విల్లా రిసార్ట్ లో నిర్వహించిన ‘ఇందిరమ్మ మైనార్టీస్ మహిళా శక్తి’ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా పరకాల నియోజకవర్గంలో అర్హులైన మహిళలకు కుట్టు మిషన్‌లను పంపిణీ



చేసినట్లు తెలిపారు. సంగెం, గీసుగొండ మండలాలు మరియు బల్దియా పరిధిలోని 16, 17 డివిజన్లకు చెందిన మొత్తం 50 మంది లబ్ధిదారులకు మిషన్‌లు అందజేసినట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, లబ్ధిదారులు కుట్టు యంత్రాలను సమర్థంగా వినియోగించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలను వినియోగించుకోవడంతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులు అభ్యసించి ఆధునిక నైపుణ్యాలు సంపాదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, ఆర్డీవో సుమ తదితరులు పాల్గొన్నారు.